## శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లి కథల పోటీలో

## విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

**రాత్రి పదకొండు గంటలు దాటింది. గంటనుంచీ కురిసిన వాన అప్పుడే తగ్గినా ఆకాశాన్ని పట్టిన మబ్బులు వీడలేదు. మెరుపులు గాని, ఉరుములు కాని తగ్గ లేదు. చల్లటిగాలి వీస్తోంది.**

**తలుపుకొట్టిన చప్పుడయితే సుభద్రమ్మ మంచం మీదనుంచి లేచింది.**

**అది ఊరి బయట కాలనీ. ఆ కాలనీలో ఇళ్ళకంటే ఖాళీ స్థలాలే ఎక్కువగా ఉన్నాయి. రోడ్లుకూడా సరిగ్గా వేయలేదు. మొదటిసారిగా తవ్వి మట్టిపోసి దానిమీద కంకర వేశారు. అది అణిగిం తరువాత తారురోడ్డు వేయాలనేది ఆలోచన. అక్కడకు మెయిన్‌రోడ్డు ఫర్లాంగు దూరంలో ఉన్నది.**

**పది గంటలకు పోయిన కరెంటు పావు గంట క్రితం రావటంతో, అప్పటిదాకా గాలికోసం తలుపులు తెరుచుకొని దోమల్ని భరిస్తున్న వాళ్ళు, ఫ్యాన్లు వేసుకొని తలుపులు మూసి పడుకున్నారు.**

**ఇంత అర్ధరాత్రప్పుడు తలుపు ఎవరి కొట్టిందీ అర్థం కాలేదు. ఏ దొంగ వెధవో రాలేదు కదా అని తటపటాయించింది ఆమె. అరవయ్యేళ్ళ వయస్సు ఇచ్చిన అనుభవంతో వెంటనే తలుపు తీయకుండా, కిటికీ తలుపు తీసింది కాని, వచ్చిన వాళ్ళు తలుపుకు దగ్గరగా నిలుచోవటంతో కనబడలేదు. అందునా కటిక చీకటి.**

# నువ్వా... నేనా...

### బి.ఎస్.నారాయణ

కొడుకు శేఖరం, కోడలు సునీత తలుపులు వేసుకు పడుకున్నారు. మనవరాలు – పది నెలలది ఇప్పటిదాకా ఏడుస్తున్నదల్లా, ఫ్యాను గాలికి హాయిగా పడుకున్నది.

మరోసారి శబ్దమయింది.

''ఎవరు?'' అన్నది కాస్త కంఠం హెచ్చించి సుభద్రమ్మ.

అటునుంచి మాట వినబడలేదు.

ఇంకా నిద్రపట్టని కొడుకు మంచం మీద నుంచి లేచి గది తలుపు తీసుకు బయటకు వచ్చాడు తల్లి కంఠం వింటూనే.

కొడుకు వెనగ్గా కోడలు బయటకు వచ్చింది.

''ఎవరో తలుపు కొడుతున్నారురా... ఎవరంటే మాట్లాడటం లేదు!''

కొడుకు తలెత్తి ఒకసారి గడియారం వంక, ఇంత రాత్రప్పుడు తన కొంపకు వచ్చేది ఎవరా అన్నట్లుగా, చికాగ్గా చూచాడు.

ఆరు నెలలయింది ఆ ఇల్లు కట్టి. పొరుగూళ్ళలో వున్న చాలామంది బంధువులకు తన ఇల్లు తెలియను కూడా తెలియదు

ఊళ్ళో తెలిసిన వాళ్ళు ఎవరయినా పగటి పూట వస్తారుగాని ఈ వాతావరణంలో, బస్సులు కూడా సరిగ్గా లేని తన ఇంటికీ, మరీ అవసరం పడితే తప్పరారు.

పలకరింపులూ, చిన్నచిన్న పనులూ సెల్ ఫోన్ మీదే జరిగిపోతుంటాయి.

ఇంట్లో వున్న వాళ్ళకు వీలుగా ఉంటుందని ల్యాండ్ ఫోనుకోసం వారం రోజుల క్రితమే డబ్బు కట్టాడు. అదీ రెండు మూడు రోజుల్లో రావచ్చు.

లేచి, ముందు హాల్లోనూ, బయటా లైటు వేశాడు. తరువాత తలుపు తెరిచాడు.

ఎదురుగ్గా ఓ స్త్రీ, చంకన చిన్నపిల్ల...

ఆమె తన ముఖాన్ని ఆ ఇంటిలో ఎవ్వరికీ చూపించటం ఇష్టం లేదన్నట్లుగా తలవంచుకు నిలబడి వున్నది. ఆమె సన్నగా, బలహీనంగా వున్నది. ఆమె శరీరమంతా దిగుళ్ల గూళ్ళతో నిండిపోయిందన్నట్లుగా కుంచించుకుపోయి వున్నది. ఆమె ఏదో కీకారణ్యంలో చిక్కుకున్నదన్నట్లుగా ఒత్తయిన జుట్టంతా ముఖాన్ని సరిగ్గా కనబడనీయకుండా చిందరవందరగా కప్పివేసి ఉన్నది. ఆ జుట్టు వెనగ్గా కళ్ళు ఉన్నాయా లేవా అన్నట్లుగా ఎక్కడో లోపలకు పోయి కొడి గట్టిన దీపాల్లా మిణుకుమంటున్నాయి. ఆమె శరీరమంతా కంపిస్తున్నదని స్పష్టంగా ఆ దీపపు వెలుగులో కనబడుతున్నది.

కళ్ళు చికిలించి చూచాడు అతడు.

''ఎవరు?'' అన్నాడు వింతగా ఆమెనే చూస్తూ. అతడికి ఆ ఆకారం చూస్తుంటే ఏదో అనుమానం రాగా మనస్సంతా కంపరమెత్తినట్లయింది.

''నేను పాపను!''

ఆ కంఠం వింటూనే అక్కడున్న ముగ్గురికీ ఆమె ఎవరో స్పష్టంగా అర్థమయి పోయింది.

ఎవ్వరికీ నోటమాట పెగల్లేదు. కొద్దిక్షణాల వరకూ తెరుచుకున్న నోళ్ళు మూత పడనే లేదు.

''ఎందుకొచ్చావ్?'' అతడు సూటిగా అరుస్తున్నట్లుగా అడిగాడు.

సుభద్రమ్మ బాధతో చటుక్కున ముఖాన్ని గోడవారకు తిప్పుకొని, ఏడుపు బిగ పట్టుకుంటోంది – కొడుకు తన ఏడుపు చూసి ఎక్కడ తిట్టిపోస్తాడోనన్నట్లుగా.

వచ్చింది ఆమె కన్న కూతురు భారతి... ఇంట్లో

అంతా ఎంతో ముద్దుగా చూచుకున్న పాప!

శేఖరంకు స్వయానా చెల్లెలు!

''ఎందుకు వచ్చావ్?'' మరోసారి రెట్టించాడు కళ్ళు నిప్పులు కురిపిస్తుండగా.

పాప మాట్లాడలేదు.

ఆమె చంకన వున్న చిన్నపిల్ల. అతడి అరుపుకు దడుసుకున్నదా అన్నట్లుగా ఏడుపు మొదలు పెట్టింది.

''నోరు తెరిచి చెప్పు.... ఎందుకు వచ్చావ్?'' కఠినంగా అన్నాడు అతడు.

''పది రోజుల క్రితం ఆయన యాక్సిడెంట్‌లో పోయారు!'' అగాధంలో కూరుకు పోయి, ఊపిరందక గిలగిలలాడుతున్నట్లుగా అన్నది.

''ఆయనపోతే అత్తగారింటికి వెళ్ళాలి... అంతే గాని మేమూ, మా ఇల్లు కాదని వెళ్ళిపోయిన దానివి ఏ ముఖం పెట్టుకొని వచ్చావ్ ఇప్పుడు?''

''అక్కడకు వెళ్ళాను!'' అవమానభారంతో తల వంగిపోగా లోగొంతుకతో అన్నది.

''అంటే.... వాళ్ళు మెడపట్టుకొని గెంటారన్నమాట!'' చాలా మంచిదయింది అన్నట్లుగా తేలిగ్గా అన్నది, శేఖరం వెనగ్గా నిలుచున్న అతడి భార్య.

కొద్ది నిముషాల నిశ్శబ్దం పాపను చిత్ర హింసలు పెట్టింది.

''నేను ఏమయినా ఫరవా లేదు.... కానీ నా ఈ పసిపిల్ల ఆకలితో ఏడుస్తుంటే చూడలేక, ఓదార్చలేక సిగ్గువిడిచి ఇక్కడకు రాక తప్పలేదు!'' అన్నది గుండెల్లో మంటలు రేగుతుండగా.

''ఇంతజరిగినా ఇంకా నీకు పొగరు అణగలేదంటే నిన్ను ఆ పైనున్న దేవుడు కూడా రక్షించలేడే... నిన్ను నువ్వు రక్షించుకోవాలంటే నీకు మన ఊరి చివర పారుతుండే కృష్ణేగతి... ఫో... వెళ్ళిపో... నేను ఇల్లుకట్టి ఇంకా సంవత్సరం దాట లేదు.... మగడు చచ్చిన పది రోజులకే నువ్వు ఇలా ఈ ఇంట కాలు పెడితే మాకు కలిసిరాక పోంగా, నాశనమయి పోతాం!'' అన్నాడు తలుపులు మూసివేసేందుకు అన్నట్లుగా వాటి మీద చేయి వేస్తూ.

గోడ వారగా నిలుచున్న సుభద్రమ్మ దుఃఖం బయటకు రాకుండా నోట్లో చీర చెంగు కుక్కుకున్నది.

సునీత విసురుగా వెనక్కు తిరిగి తమ పడక గదిలోకి వెళుతూనే పెద్ద శబ్దమయ్యేలా తలుపు మూసి వేసింది.

శేఖరం వెనక్కు తిరిగాడు: ''దానికి నువ్వేం చెప్పుకుంటావో చెప్పుకో.... కన్నావు కదా మన వంశానికి ఘనమైనకీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన ప్రబుద్ధురాలని... అది మాత్రం లోపలకు రావటానికి వీల్లేదు!'' వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి, దగ్గరకు వేసి వున్న తన బెడ్‌రూం తలుపుని, చెల్లెల్నే తన్నుతున్నట్లుగా ఒక్కతన్ను తన్ని, లోపలకు వెళుతూనే తలుపు మూసి, బోల్ట్ పెట్టేసుకున్నాడు.

సుభద్రమ్మ ఏం చేయాలో తెలియనట్లుగా వుండిపోయింది.

'నా భుజాన వున్న పాప బ్రతకాలంటే మరో మార్గంలేదు' అన్నట్లుగా ఆ అమ్మాయి అక్కడే శిలలా నిలబడిపోయింది, తన స్వంత అన్నయ్య అన్న మాటలు గుండెను ఛిద్రం చేస్తున్నా, శరీరాన్ని జివ్వుమనిపిస్తున్న చల్లటి గాలిని కూడా లెక్కచేయకుండా.

సుభద్రమ్మ రోదిస్తున్నది.

మళ్ళా భళ్ళున శేఖరం పడుకున్న గది తెలుపు తెరుచుకున్నది. అతడు విసురుగా బయటకు వచ్చాడు. ''ఇదుగో అమ్మా! దాన్ని పొరబాటున కూడా లోపల కాలు పెట్టనీయబోకు... ఇవ్వాళ అసలే శుక్రవారం... కాదంటే, నువ్వంత కడుపుతీపి చంపుకోలేకపోతే దాని ముఖాన ఓ పదో పరకో పారేసి పంపించేసేయ్... అదీ పిల్ల ఆకలితో చస్తున్నదంటున్నది కాబట్టి!'' మళ్ళా వచ్చినంత విసురుగానూ లోపలకు వెళ్ళిపోయాడు.

***

మూడు సంవత్సరాల క్రితం.

ఓరోజు సాయంత్రం ఆరుగంటల సమయంలో, ఆఫీసులో కాగితాలన్నీ సర్ది శేఖరం బయటకు వచ్చి, రోడ్డు మీద నడుస్తుండగా ఓ అగంతకుడు అతడి దగ్గరకు వడివడిగా వచ్చి, ''ఒళ్ళెలా వున్నది.... నీ చెల్లెల్ని అదుపులో పెట్టుకోక పోయావో నీ



అంతు చూస్తాను... తలకాయలే లేచిపోతయ్, జాగ్రత్త!'' అన్నాడు మీదమీదకు వస్తూ, చొక్కా పట్టుకున్నంత పనిచేసి.


శేఖరం బిగుసుకుపోయాడు అతడి మాటలకూ, అతడి తీరుకూ, ఏం మాట్లాడాలో అర్థం కానంతగా కలవర పడిపోయాడు.

అతడు దాదాపు ఆరడుగుల ఎత్తున ఉన్నాడు. దృఢంగా ఉన్నాడు. చొక్కా చేతులు పైకి మడిచి, కొట్టేటందుకు తయారయి వచ్చినట్లుగా ఉన్నాడు. గుబురు మీసాలు. తన పద్ధతే వేరు అన్నట్లుగా మెళ్లో రెండు పేటల గొలుసు.

''మీరేం మాట్లాడుతున్నారో నాకు తెలియటం లేదు!'' అన్నాడు బిక్కముఖ మేసుకొని, తననెవ రైనా తెలిసిన వాళ్ళు చూస్తున్నారేమోనన్నట్లుగా అటూ ఇటూ భయంగా చూస్తూ శేఖరం. అయినా తను తన చెల్లెల్ని అదుపు చేయటమేమిటి! – అదేం తప్పు చేసిందని?

''నేను కిరణ్ మేనమామను!'' అన్నాడు అతడు మరింత కరుకుగా.

''కిరణ్ ఎవరు?''



## నేను ప్రేమిస్తాను....

'నేను ప్రేమిస్తాను' అంటూ నవ్వుల పూబోణి హాసిని అంటోంది. నిన్న మొన్నటి వరకూ 'ప్రేమా, పెళ్ళిలాంటివి ఇప్పుడప్పుడే లేవు' అంటూ స్టేట్మెంట్లు ఇచ్చిన ఈ చిన్నది ఇప్పుడు ప్రేమ జపం చేస్తోంది ఏమిటి? అని ఆశ్చర్యపోనక్కర్లేదు. జెనీలియా ప్రేమను ప్రేమిస్తుందట! 'ప్రేమకు తప్పంచి తన మనసులో మరొకరికి చోటు లేదంటూ' ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. రితీష్ దేశ్ముఖ్తో తన చనువును అందరూ అపార్థం చేసుకున్నారనీ, కొందరైతే తాను రితీష్ను పెళ్ళి చేసుకుంటున్నాననీ పుకార్లు కూడా పుట్టించారని ఆవేదన వ్యక్తం చేసింది.

''మీ చెల్లెలు గుప్పిటలో ఇరుక్కుపోయిన నా మేనల్లుడు!.... అంతేకాదు నా కాబోయే అల్లుడు!'' అతడి కంఠం కత్తులు నూరుతున్నట్లే వున్నది. ''ఇది మొదటి వార్నింగ్... మరోసారి దాన్ని వాడితోకాని చూశానో, అదీ నువ్వూ శవాలై తేలతారు!''

చటుక్కున తలెత్తి విభ్రాంతిగా ఆయన వంక చూశాడు.

''మీరు చెబుతున్నదేమిటో నాకేమీ అర్థం కావటం లేదు!'' అన్నాడు నంగిగా. ''మా చెల్లెలికీ, మీ మేనల్లుడికీ సంబంధమేమిటి?''

''వాడు మగ పిల్లవాడు ఎన్ని వేషాలయినా వేస్తాడు... తాడూ బొంగరం లేని నీ చెల్లెలు వాడికి వలేస్తుందా... ఏమనుకుంటున్నారు మీరు... చెప్పు! డబ్బు కావాలంటే మీ మొహాన పారేస్తాను, అంతే గాని అది వాడికి భార్య అవ్వాలని ఆశ పడిందో నెత్తురు ఏరులై పారుతుంది.... బోడి అందాన్ని ఎర గావేసి వాడిని వలలో వేసుకోవటమే, వెనుకా ముందూ చూచుకోకుండా. మాకెంత నామర్దా... అరేయ్ చెబుతున్నాను విను.. నేనెంత మంచివాడినో అంతదుర్మార్గుడిని.... జరగ రానిదేదైనా జరిగితే తరువాత నన్నని లాభం లేదు!'' ఎంత విసురుగా వచ్చాడో అంత విసురుగానూ వెళ్ళిపోయాడు అతడు శేఖరంకు మరో మాటకు అవకాశం ఇవ్వకుండా.

శిలలా అట్లాగే నిలబడిపోయాడు శేఖరం ఆ షాక్నుండి కోలుకోలేనట్లుగా.

తరువాత అరగంటకు అస్తవ్యస్తమయిన మనస్సుతో ఇంటికిజేరిన అతడికి అప్పుడే బయటకు వెళుతున్న చెల్లెలు వాకిటి దగ్గర కనబడింది.

''లోపలకు పద!'' అన్నాడు కంఠం హెచ్చించి అరుస్తున్నట్టుగా.

ఉలిక్కిపడ్డట్టుగా అన్నవైపుకు చూచింది భారతి అతడి మాటతీరుకు కలవరపడుతూ.

వెనక్కు తిరిగి భయం భయంగా లోపలకు వెళ్ళింది.

ఆమె వెనగ్గా వచ్చిన శేఖరం లోపల కాలు పెడుతూనే తలుపు వేశాడు. వడివడిగా చెల్లెలు దగ్గరకు వెళ్ళి ఆమె మెడమీద చేయివేసి గట్టిగా పట్టుకున్నాడు. ''కిరణ్ ఎవరు?'' హూంకరిస్తున్నట్లే అడిగాడు.

బిత్తరపోయింది భారతి. ఎప్పటికయినా తనకు అది సమాధానం చెప్పవలసిన ప్రశ్నే అని తెలిసినా ఇంత అకస్మాత్తుగా ఎదుర్కోవలసి వస్తుందని అనుకోలేదు.

''నాకు కాలేజీలో సీనియర్!'' అన్నది తలవంచుకొని నంగిగా.

ఫట్మని చెంప పగిలేలా కొట్టాడు.

అతడి కేకలకు సునీత వచ్చింది హాల్లోకి. సుభద్రమ్మ వచ్చింది కంగారుగా.

''ఏమైందిరా?'' అన్నది ఆత్రంగా వాళ్ళ దగ్గరకు వస్తూ.

''ఈవిడగారు చదువుతున్న బోడి చదువుకు అప్పుడే ప్రేమలో పడింది... ఎవడో కిరణ్గాడట... వాడి మేనమామ నన్ను పట్టుకొని నడిరోడ్డు మీద దులిపేశాడు.. ఇది పిచ్చిపిచ్చి వేషాలు వేయటం మానేయకపోతే చంపేస్తానన్నాడు!'' అన్నాడు కోపంతో చెల్లెలి మీద కళ్ళల్లో నుంచి నిప్పులు కురిపిస్తూ. ''ఇక చదివింది చాలు... కొంపలో పడి చావు... కాలు బయటపెట్టావో విరగగొడతాను.... తెలిసిందా!'' అంటూ ఆ అమ్మాయిని గదిలోకి నెట్టి బయట గొళ్ళెం పెట్టాడు.

'ఛ! ఛ! ఓ రౌడీవెధవ చేతిలో, దీని మూలంగా, తను ఎంత అప్రదిష్ట పాలయ్యాడు!'

సరిగ్గా వారం రోజులకు....

ఓ రాత్రి పన్నెండు గంటల సమయంలో భారతి 'నేను కిరణ్ని మరిచిపోలేను. అటు నా మూలకంగా మీరు అవమానాల పాలు అవ్వటమూ నాకూ ఇష్టం లేదు. అందుకే నేను ఈ ఇంటినుంచి వెళ్ళిపోతున్నాను. నన్ను మరిచిపోండి... ఈ క్షణం నుంచీ నేను మీకేం కాను' అంటూ ఓ చీటీ రాసి ముందు గదిలో టేబుల్ మీద పెట్టి, ఆ ఇంటి తలుపు తీసుకొని చీకటిలో కలిసిపోయింది.

జరుగుతున్న గొడవలన్నిటికీ త్వరలోనే ముగింపు పలకాలన్నట్లుగా మరునాడు ఉదయాననే తన స్నేహితుల నడుమ ఊరిబయట ఓ గుడిలో భారతి మెడలో మూడు ముళ్ళువేశాడు కిరణ్ – పర్యవసానం తనూ తన ఇంటినుండి కట్టుబట్టలతో బయటకు రావాల్సి వస్తుందని తెలిసినా.

అయినా అతడు జంకలేదు. స్నేహితుల సాయంతో తిండికి సరిపడే సంపాదనలో పడి, ఓ చిన్న ఇంట్లో, ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత ప్రేమగా కొత్త జీవితాన్ని ప్రారంభించారు... సంవత్సరం తిరక్కుండానే వాళ్ళు ప్రేమకు చిహ్నంగా పుట్టిన పాపను అపురూపంగా పెంచుకోసాగారు.

***

ఆకాశం ఎప్పుడయినా పగిలి ముక్కలవుతుందేమోనన్నట్లుగా మెరుపులు, ఉరుములు... మళ్ళా వాన వస్తుందేమోననే భయం మనస్సును తొలిచేస్తోంది.

అసలే చీకటి. వానొస్తే మాత్రం మరోసారి కరెంటు పోవటం ఖాయం...

ఎదురుగా పాప కదలకుండా మెదలకుండా అక్కడే నిలుచున్నది. బయట వీస్తున్న చల్లగాలిని తట్టుకునేందుకు అన్నట్లుగా చీరచెంగును భుజం నిండా, చంకలో నీరసంతో బెక్కుబెక్కుమంటున్న కూతురు మీదగా కప్పుకున్నది.

కన్నకూతురు తన ఇంటి వాకిట అలా దీనావస్థలో బిచ్చగత్తెలా నిలబడి వుండటం సుభద్రమ్మ తట్టుకోలేక పోతోంది. ఆమె మనస్సు తూట్లు పడుతోంది.

కనీసం ఈ భయంకరమైన వాతావరణంలో ఈ రాత్రికయినా లోపలకు రమ్మనమందామన్నా కత్తుల్లా విసిరిన కొడుకు మాటలు ఇంకా గుండెల మీద గుచ్చుకుంటూనే ఉన్నాయి. ఆ బాధకు భయంతో విలవిలలాడి పోతున్నది.

పెద్దగా ఉరుములు. కళ్ళు పగిలేలా ఓ పెద్ద మెరుపు. ఎక్కడో పిడుగుపడిన శబ్దం.

ఉలిక్కిపడ్డట్లుగా మెడ తిప్పి బయటకు చూచింది.

దీపపు కాంతిలో పడుతున్న సన్నటి జల్లు స్పష్టంగా కనబడుతున్నది.

– ఆపైన వెనక్కుతిరిగి భారంగా అడుగులు వేసుకుంటూ బయటకు వెళుతున్న పాప కనబడింది. ఆమె చీరచెంగు వెనుకనుండి మనమరాలి ఏడుపు వినబడు తున్నది.

దుఃఖాన్ని, బాధను, ఆవేదనను నిగ్రహించుకో లేక పోయింది. అలా బయటకు అడుగులు వేస్తున్న కూతుర్ని చూస్తుంటే, ఆమెలో ఓ సన్నని నరం కదిలి గుండెల్ని మెలి తిప్పసాగింది.

చటుక్కున ఓ నిర్ణయానికి వచ్చిన దానిలా గడపవతల కాలుపెట్టింది. చల్లటి గాలి ఆమెను మరింత ఇబ్బంది పెడుతున్నట్లుగా ముఖంమీద ఒక్కసారి ఈడ్చికొట్టింది.

పడుతున్న జల్లును లెక్కచేయకుండా చీరచెంగును తలమీదకు లాక్కుని వెళుతున్న కూతురు వైపుకు వడివడిగా అడుగులు వేసింది సుభద్రమ్మ.

''ఆగు!'' తల్లి కంఠం వింటూనే పాప ఆగింది గాని, మెడ వెనక్కు తిప్పలేదు.

''ఎక్కడకు వెళుతున్నావ్?''

''అన్నయ్య చెప్పాడుకదా కృష్ణకు వెళ్ళమని... మీ ఇంటే నాకు స్థానం లభించనపుడు నేనింకెక్కడికి వెళ్ళగలను?.... నా కూతురు ఆకలిని నేను చూడలేను... దాని ఏడుపును భరించలేను.... మా ఇద్దరికీ శాంతి, విశ్రాంతి లభించేది అక్కడే మరి!''

ఆమె ఏడ్వటం లేదు. ఆమె కంఠంలో జీర లేదు.

## తల్లి ప్రేమ



ఎవరు ఎవర్ని ఎంతగా ద్వేషించినా తల్లి ఎప్పుడూ తను కన్నపిల్లల్ని గుండెలోనే దాచుకుంటుంది. ఆ నిజాన్ని చెప్పాలనుకోవటమే ఈ కథకు ప్రాతిపదిక. ఇప్పటికి రెండు వందల అరవైకి పైగా కథలు, ముప్పయి ఒక్క నవలలు రాశాను. మానసిక విశ్లేషణతో నిండిన రచనలు చేయటం ఇష్టం. సస్పెన్స్‌తో కూడిన ధారావాహికలు రాయటమన్నా ఇష్టమే! నా కథకు విశేష బహుమతి ఇచ్చిన సంపాదకులకు కృతజ్ఞతలు.

**–పి.ఎస్.నారాయణ**
*8-3-168/20/బి/7,*
*సిద్ధార్థనగర్ (నార్త్), ఏ.జీ.కాలనీ దగ్గర,*
*హైదరాబాద్ - 38*
*సెల్ : 9948319407*

ఆమె ఎంతో గుండె నిబ్బరంతో ప్రతి మాటనూ ఒత్తి ఒత్తి పలికింది.

''ఆనాడు అర్ధరాత్రి సమయంలో నువ్వు నా ఇంటినుండి అడుగు బయటకు వేస్తున్నప్పుడు, మంచం మీద దుప్పటి కప్పుకొని మెలకువతోనే ఏడుస్తూ పడుకొని వున్న నేను, నిన్ను వారించలేక పోయాను. వారించి నీ ఆనందాన్ని, నీ భవిష్యత్తును త్రుంచి వేయలేకపోయాను... మనస్సులోనే నువ్వెక్కడున్నా సుఖంగా వుండాలని కోరుకున్నాను...''

''ఇప్పుడు మీరు కోరుకుంటున్నదీ అదేగదా... ఏం చేయాలో తెలియక సతమత మవుతున్న నాకు మార్గం చూపిస్తిరి!''

''నేనూ నీతోనే వస్తున్నాను పద!''

చటుక్కున వెనక్కు తిరిగింది పాప. ''నువ్వు దేనికి... కొడుకు పంచన హాయిగా వుండక!''

''నీ కూతురు బాధను నువ్వు చూడలేవు... నీ కూతురి ఆకలి ఏడుపును నువ్వు భరించలేవు... నువ్వు నీ కూతుర్ని ఎలా తొమ్మిది నెలలు మోసి కన్నావో, నేనూ నిన్ను అలాగే తొమ్మిది నెలలు మోసి కన్నాను.... నీ పేగు తెంపుకొని అది నీకెలా పుట్టిందో, నువ్వూ నాకు అలాగే పుట్టావు... నువ్వు దాని బాధను ఎలా చూడ లేవో, నేనూ నీ బాధను చూడలేను... నువ్వు దాని ఆకలి ఏడుపును ఎలా వినలేవో, నేనూ నీ ఆకలి ఏడుపును వినలేను... అందుకే దేనినైనా ఇద్దరం కలిసే అనుభవిద్దాం... ఎక్కడైనా కాస్త నీడ దొరుకుతుందేమో చూచుకుందాం... దొరకలేదా, కృష్ణమ్మ ఉండనే ఉన్నది!''

ఎక్కుపుట్టేలా ఏడుస్తూ కూతుర్ని, ఆమె చంకనున్న మనుమరాలిని పొదివి పట్టుకున్నది సుభద్రమ్మ – పాప తల్లి!

*

## మనమీదేసక్రోయ్!

సరసి



